క్లుప్తంగా

ఘనంగా వెంకటయ్య తాత ఆరాధన


వెంకటయ్య తాతకు ఆరాధన

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువులో వెంకటయ్య తాత ఆరాధన సోమ, మంగళవారాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాత చిత్రపటాన్ని తప్పెట్లు, తాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం నుంచి భక్తులు తలంటి స్నానాలు చేసి పొంగళ్లు తాతకు సమర్పించారు. తమ కోరికలు నెరవేరాలని, తమ పిల్లాపాపలు, వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని వేడుకుంటారు. ఈ సందర్భంగా ఏటా కార్తీక మాసంలో తాతకు మొక్కులు తీర్చుకుని ఆరాధన చేస్తారు. తాత పూర్వీకులు నైవేద్యాలు సమర్పించి భోజనాలు ఏర్పాటు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

స్వీప్‌తో ఓటు నమోదు చేసుకోవాలి


ఓటు నమోదు పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ

దర్శి: స్వీప్‌తో ఓటు నమోదు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎలక్షన్ డీటీ దేవ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఓటు ప్రాధాన్యం గురించి వివరించారు. ఓటు నమోదు ఫారాలు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె. ప్రభుదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిర గాంధీకి ఘన నివాళి

దర్శి: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిర గాంధీ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రధానిగా ఆమె చేసిన సేవలు కొనియాడారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పుట్లూరి కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పుల్లారెడ్డి, సాయికృష్ణ, శంకర్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

హోమియో వైద్యుడు లేక అవస్థలు


నిరుపయోగంగా ఉన్న హోమియో వైద్యశాల

దొనకొండ: మండల కేంద్రం దొనకొండకు 2009–10లో హోమియో వైద్యశాల మంజూరైంది. అప్పట్లో రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసి వైద్యశాల నిర్మించింది. డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి 2010లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హోమియో వైద్యుడిని నియమించారు. 2012–13లో అనివార్య కారణాలతో ఉన్నతాధికారులు హోమియో వైద్యుడిని విధుల నుంచి తొలగించారు. నాటి నుంచి నేటి వరకు వైద్యుడిని నియమించక పోవడంతో మండలంలోని గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హోమియో వైద్యశాల మాత్రం నేడు నిరుపయోగంగా మారింది. దొనకొండ, కురిచేడు, దర్శి, కొనకనమిట్ల మండలాల నుంచి ఎక్కువ భాగం ప్రజలు ఇక్కడికి వచ్చి హోమియో వైద్యం పొందేవారు. అప్పట్లో రోజుకు సుమారు 90–100 ఓపీ వచ్చేది. అందుబాటులో వైద్యుడు లేక పోవడంతో రోగులు యర్రగొండపాలెం, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు హోమియో వైద్యం కోసం వెళ్తున్నారు. గతంలో ఇక్కడ వైద్యుడిగా ఉండి సేవలందించిన వెస్లీ ప్రస్తుతం యర్రగొండపాలెంలో ప్రైవేటు హోమియో వైద్యశాల నడుపుతున్నారు. చాలా మందికి ఇంగ్లిష్ వైద్యం కన్నా హోమియో వైద్యంపైనే నమ్మకం ఎక్కువ. ఇంగ్లిష్ మందులు వాడి అనారోగ్యం పాలై కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్యం పొందుతూ రూ.లక్షలు కాజేసుకుంటున్నారంటూ గ్రామాల్లోని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, పెద్దలు సైతం హోమియో వైద్యశాలకు పరుగులు తీస్తున్నారు. సంబంధిత అధికారులు హోమియో వైద్యుడిని నియమించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు హోమియో వైద్యానికి అలవాటు పడ్డారు:



గ్రామీణ ప్రాంత ప్రజలు హోమియో వైద్యానికి అలవాటు పడ్డారు. ఇంగ్లిష్ మందులు వాడి ఖర్చులు భరాయించలేకపోతున్నారు. దొనకొండలో హోమియో వైద్యుడు ఉన్నప్పుడు రోజుకు సుమారు 100 ఓపీ వచ్చేది. మండల స్థాయిలో అందుబాటులో హోమియో వైద్యశాల ఉండటంతో ఆర్‌ఎంపీల దగ్గరకు ఎవరూ వెళ్లే వారు కాదు. వెంటనే ప్రభుత్వం స్పందించి హోమియో వైద్యుడిని నియమించాలి. – చిరుపల్లి అంజయ్య, దొనకొండ

ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు:



గ్రామాల్లోని ప్రజలు సుదూర ప్రాంతాలైన నరసరావుపేట, గుంటూరు వెళ్లి హోమియో మందులు తెచ్చుకుంటున్నారు. స్థానికంగా వైద్యశాల ఉన్నా వైద్యుడు లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత జిల్లా అధికారులు హోమియో వైద్యుడిని నియమించాలి. – కర్నా హనుమయ్య, గుట్టమీదపల్లి

విద్యుత్ అక్రమ వినియోగంపై దాడులు


వివరాలు వెల్లడిస్తున్న డీపీఈ ఈఈ హైమావతి

దర్శి: విద్యుత్ అక్రమ వినియోగంపై ఆ శాఖ అధికారులు దాడులు చేశారు. పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులు, సిబ్బంది 44 బ్యాచ్‌లుగా ఏర్పడి 3,634 సర్వీసులు సాయంత్రం వరకు తనిఖీలు చేసి 43 మంది వినియోగదారులు అక్రమ విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వీరికి రెండు లక్షల వరకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా డీపీఈ ఈఈ హైమావతి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ అనధికారకంగా వినియోగం నిబంధనల ఉల్లంఘన అని చెప్పారు. నిర్దేశిత సామర్థ్యం కన్నా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. దర్శి డివిజన్ ఆపరేషన్ ఈఈ పి.శ్రీనివాసులు, డీఈఈ పిచ్చయ్య, ఆర్.మోహన్‌రావు, డీపీఈ డీఈఈ వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, డివిజన్ పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కెనరా బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

పెద్దదోర్నాల: ఖాతాదారుల శ్రేయస్సే తమ బ్యాంకు ముఖ్య ఉద్దేశమని కెనరా బ్యాంకు మేనేజర్ పాలేటి మురళీకృష్ణ పేర్కొన్నారు. కెనరా బ్యాంకు ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంకులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు అందించడంలో తమ బ్యాంకు అగ్రగామిగా ఉందన్నారు. మనం ఏ లోన్ తీసుకున్నా వాయిదాలు సక్రమంగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాడు అందించాలని చెప్పారు. తమ బ్యాంకు కస్టమర్లకు తోడ్పాటు అందిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన బ్యాంకన్నారు. కెనరా బ్యాంకు రూ.21 లక్షల కోట్ల వ్యాపారం నిర్వహించిందన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన రుణాలు అందించడంలో దేశ వ్యాప్తంగా 5వ స్థానంలో ఉన్నామన్నారు. తమ బ్యాంకులో లేని స్కీం మరే బ్యాంకులో ఉండదని పేర్కొన్నారు. పొదుపు సంఘాల మహిళలు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం..


మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

దర్శి: కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ధరల భారాలు, మతోన్మాద ప్రమాదానికి వ్యతిరేకంగా ఉద్యమించి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. సీపీఎం మండల 7వ మహాసభను సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు కేవీ పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన మహాసభలో కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టించే విధంగా జమిలి ఎన్నికలకు కేంద్రం సిద్ధం కావడం అమానుషమన్నారు. మతాన్ని రాజకీయాల్లోకి దించి ప్రజల్ని మూఢత్వంలోకి నెట్టే చర్యలకు కేంద్రం పాల్పడుతోందని విమర్శించారు. ఇరుగు పొరుగు దేశాలతో శాంతి సందులు చేసుకోవడం సామరస్య వాతావరణాన్ని కాపాడటం ద్వారా 5 లక్షల కోట్ల రూపాయలు రక్షణ వ్యయం వృథా కాకుండా దేశ ప్రజల సంక్షేమానికి మిగులుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజలపై పెను భారం మోపారన్నారు. రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా అప్పులు ఇస్తామనడం, విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టడం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ప్రజా అనుకూల పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం భారాలు మోపుతోందన్నారు. ఐదు నెలల్లో 18 వేల కోట్ల భారం ప్రజలపై మోపడం దారుణమన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంపై సాకు చెప్పి ఈ ప్రభుత్వం తప్పించుకోవడం తగదన్నారు. సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు తీవ్ర రూపం దాల్చాయని, మద్యం, మత్తుమందులు వీటికి కారణాలుగా ఉంటున్నాయన్నారు. వీటి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. మద్యాన్ని నియంత్రించేలా నూతన మద్యం పాలసీని సవరించాలని కోరారు. సీపీఎం దర్శి మండల కార్యదర్శి తాండవ రంగారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 420 పార్లమెంట్ స్థానాలు వస్తాయని, దానితో రాజ్యాంగాన్ని మార్చేస్తామని, దేశాన్ని వికసిత్ భారత దేశంగా మారుస్తామని బీజేపీ ప్రగల్భాలు పలికిందని చెప్పారు. లౌకిక తత్వాన్ని ఆచరించే దేశ ప్రజలు బీజేపీకి సంపూర్ణ మెజార్టీ ఇవ్వకుండా సరైన బుద్ధి చెప్పారని హెచ్చరించారు. అయినా కూటమి పార్టీల అండతో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశాన్ని తాకట్టు పెట్టే విధానాలను తన మత ఉన్మాద చర్యలను ఆపలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రకృతి వనరులను అడ్డగోలుగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని మండిపడ్డారు. ఫలితంగా దేశంలో సంపత వేరియేషన్ తీవ్ర రూపం దాల్చిందన్నారు. నాయకులు ఈమని నాగేశ్వరరావు, వెల్లంపల్లి ఆంజనేయులు, అంజయ్య, నారాయణ, సామ్యేల్, కాలేబాషా, ఆదినారాయణ, నాగరాజు, పుల్లయ్య, రమాదేవి, లక్ష్మి, నారాయణమ్మ, మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీయ జాగ్రత్తలపై అవగాహన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై మహేష్

పెద్దదోర్నాల: విద్యార్థులకు స్వీయ జాగ్రత్తలపై అవగాహన ఉండాలని ఎస్సై మహేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులతో సమావేశమయ్యారు. సోషల్ ఈవిల్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైం, హెల్మెట్ ధరించటం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. మారుతున్న సమాజంలో ఎదుటి వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆడ పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాట తీరు సరిగా లేని, దురలవాట్లు ఉన్న వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాలలకు వెళ్లే బాలికలకు విలువైన ఆభరణాలు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాల వినియోగంపై నిఘా ఉంచి పిల్లలతో సున్నితంగా వ్యవహరించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఎంఈఓ

త్రిపురాంతకం: సంక్షేమ హాస్టల్స్‌లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు మంచి లక్ష్యంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంపీడీఓ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక బీసీ హాస్టల్లో విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నేడు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. మనకున్న అవకాశాలను వినియోగించుకుని ఉన్నత విద్య అభ్యసించాలని కోరారు. మంచి చదువులు చదివితే అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని పేర్కొన్నారు. అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో ప్రయాసపడి చదివిస్తున్నారని చెప్పారు. దానికి తగిన విధంగా అందరూ లక్ష్యసాధనతో విద్యపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా నిర్మాణం చేపట్టి పూర్తి చేసుకున్న మరుగుదొడ్లు, స్నానపు గదులను వారు ప్రారంభించారు. వార్డెన్ కాశీనాయక్, సీఆర్పీ శ్యామ్ పాల్గొన్నారు.

జాతీయ నాయకులకు నివాళి


పెద్దారవీడు: నేతల చిత్రపటాలకు నివాళి


కురిచేడు: ఇందిరకు నివాళులర్పిస్తున్న అధికారులు

పెద్దారవీడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయంలో మంగళవారం మహిళా దినోత్సవంలో భాగంగా గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి, మదర్‌థెరిసా చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విశ్రాంతి వీడీఓ అల్లు చలమారెడ్డి మాట్లాడుతూ నేటి బాలికలు రేపటి పౌరులని, ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు పొందాలని, ఝాన్సీలక్ష్మీబాయి మహిళైనా దేశం కోసం వెనకాడకుండా పోరాటం చేసిన వీరవణితని కొనియాడారు. ప్రిన్సిపాల్ పిభే మాట్లాడుతూ ఇందిరాగాంధీ మహిళా అయినా దేశానికి ప్రధాని అయ్యారని, బాలికలు మంచిగా చదువుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవాటు పడాలని పేర్కొన్నారు. అనంతరం విశ్రాంతి వీడీఓ అల్లు చలమారెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

కురిచేడు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనూష, డీఏ ఇందిర, మహిళా పోలీస్ ప్రమీల, గ్రంథపాలకురాలు ఎల్.సుమతి పాల్గొన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

ఘనంగా ఉరుసు మహోత్సవాలు


నాసరయ్య స్వామి వారి జీవ సమాధి వద్ద భక్తుల పూజలు

త్రిపురాంతకం: నాసరయ్య స్వామి ఆరాధన ఉరుసు మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆరాధనలు జరగనున్నాయి. పెద్ద సంఖ్యలో గురు పరంపర శిష్యులు, నాసరయ్య వారి భక్తులు పాల్గొననున్నారు. త్రిపురాంతకంలోని నాసరయ్య స్వామి వారి ఆరాధనలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించారు. ఏటా కార్తీక మాసంలో పౌర్ణమి వెళ్లిన పంచమి రోజు ఉత్సవాలు జరగనున్నాయి. కులమతాలకు అతీతంగా ఉత్సవాల్లో ప్రజలు పాల్గొంటారు. ప్రకాశం జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు, కర్నూలు, నెల్లూరు జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చి పాల్గొంటారు. భక్తులకు అన్నదానం నాసరయ్య భక్త బృందం చేసింది. ఉత్సవాల్లో భాగంగా గంధోత్సవం, గురుపూజోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. గురుపరంపర శిష్యులు భారీగా తరలి వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారు.

కలలను నిజం చేసుకోవాలి

పుల్లలచెరువు: ప్రతి విద్యార్థి భవిష్యత్ గురించి కలలు కని వాటిని కష్టపడి నిజం చేసుకోవాలని ఎంఈవో ఇందిర అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ పాఠశాలలో సోమవారం మా కళలు, మా స్వప్నాలు అనే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి ఎంఈవో మాట్లాడుతూ బాలబాలికలు ముఖ్యంగా విద్య ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి వారికి ఉన్న హక్కులు, విధులు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బమ్మ, శివలక్ష్మి మాట్లాడుతూ బాలికలు చదువుకున్నప్పుడే బాల్య వివాహాలు కనుమరుగవుతాయన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ కృష్ణయ్య పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వెన్నా


వైఎస్ జగన్‌తో బ్రహ్మనందరెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దదోర్నాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డిని తాడేపల్లిలోని కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు వెన్నా బ్రహ్మనందరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యర్రగొండపాలెం శాసన సభ్యుడు తాడిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయన కలిశారు. జగన్‌మోహనరెడ్డిని బ్రహ్మనందరెడ్డి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే తాటిపర్తితో పాటు మరికొందరు నాయకులు ఉన్నారు.

సోషల్ మీడియాలో వేధింపులపై ఫిర్యాదు చేయండి


మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి: సోషల్ మీడియా వేధింపులపై 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సోషల్ మీడియా యాప్‌లైన వాట్సాప్, టెలిగ్రామ్‌లో వచ్చిన ఏపీకే ఫైల్స్‌ను ఇన్‌స్టాల్ చెయ్యవద్దన్నారు. ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీలు జరిగేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. తమ ఖాతాలకు సంబంధించిన వివరాలు గోప్యంగా ఉంచాలని, నమ్మకం కంటే జాగ్రత్త ముఖ్యమని చెప్పారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తున్నారంటే డబ్బులు పంపుతున్నారని గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. మీకు డబ్బులు రావాలంటే యూపీఐ పిన్ నంబర్ అవసరం ఉండదని సూచించారు. సీఐ వై.రామారావు మాట్లాడుతూ అమేజాన్, డెలివరీ, కేవైసీ, జాబ్, కస్టమర్ కేర్, ఎల్ఐసీ, లోన్ యాప్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్స్, ఓటీపీలు అడిగి సైబర్ నేరాలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఎస్సై మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.